క్లుప్తంగా

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

గోపాల్‌పేట: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పాండునాయక్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో సర్వేనంబరు 422, 423లో గతంలో గౌరైల ఉన్ని కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కొందరు ఈ స్థలంలో గోడలు నిర్మిస్తుండగా వారిని ప్రశ్నించారు. వారివద్ద డాక్యుమెంట్లు ఏమైనా ఉంటే తీసుకువచ్చి చూపించి నిర్మాణాలు చేసుకోవాలని, డ్యాకుమెంట్లు లేనిపక్షంలో కట్టడాలు చేపట్టొదని హెచ్చరించారు. మరోసారి ఇలాంటి పనులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట ఉమ్మడి మండల ఇంచార్జి సత్యశీలారెడ్డి, ఆర్ఐ ప్రసన్న, సర్వేయర్ భాస్కర్, శివన్న, కుర్మన్న పాల్గొన్నారు.

చేనేత రుణమాఫీకి ఆగస్టు 3 వరకు గడువు

అమరచింత: చేనేత రుణమాఫీ కోసం నేటికీ వివరాలు అందజేయని కార్మికులు ఆగస్టు 3 వరకు అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని చేనేత జౌళిశాఖ ఏడీ గోవిందయ్య బుధవారం తెలిపారు. జిల్లాలోని ఆయా జాతీయ బ్యాంకుల ద్వారా రూ.లక్ష లోపు రుణాలను పొందిన నేత కార్మికుల జాబితాను ఇప్పటికే అందజేశారన్నారు. ఇంకా వ్యక్తిగతంగా కార్మికులు రుణాలను పొందినట్లు ఉంటే సమాచారాన్ని ఆయా బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించి తమ వివరాలను ఏడీ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

తీగజాతి కూరగాయల సాగుకు రూ.లక్ష సాయం

వనపర్తి రూరల్: రైతులు ఎకరా పొలంలో తీగ జాతి కూరగాయలు పండించడానికి పందిర్లకు ప్రభుత్వం సబ్సిడీలో రూ.లక్ష వరకు సాయం అందిస్తుందని శ్రీరంగాపురం మండల ఉద్యాన వన అధికారి కృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తీగజాతి కాకర, బీర, సొర కూరగాయల సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆసక్తిగల రైతులు పొలం పాస్‌బుక్, పాస్‌ఫొటో, ఆధార్‌కార్డు, ఆర్ఓఆర్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో ఉద్యాన అధికారిని సంప్రదించాలవారు ఆయన కోరారు.

శుభ్రతతోనే ఆరోగ్యం

అమరచింత: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ నాగరాజ్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా 8వ వార్డులో పరిసరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంట్లోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి కాలనీకి వస్తున్న చెత్తట్రాక్టర్‌లో వేయాలన్నారు. వర్షపునీరు ఇంటి ముంగిళ్లలో నిల్వ ఉంచకుండా పారవేయాలని లేనిపక్షంలో దోమలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. పురపాలిక ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వనపర్తి రూరల్: పెబ్బేరులో పీహెచ్‌సీ వైద్యుడు ప్రవళిక ఆధ్వర్యంలో బుధవారం బీసీ హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ అమృత్‌సాగర్, సూపర్‌వైజర్ లీలమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్ఎమ్ లావణ్య, ఆశలు పాల్గొన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

గోపాల్‌పేట: నేడు గురువారం ఉదయం పది గంటలకు స్థానిక పద్మావతి గార్డెన్స్‌లో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ పాండునాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారన్నారు. గోపాల్‌పేట, ఏదుల, రేవల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. గోపాల్‌పేటలో 2,230, ఏదుల 1,060, రేవల్లి 411 మొత్తం 3,701 రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు.

పుల్గర్‌చర్లలో సీసీ కెమెరాలు



వీపనగండ్ల: జిల్లా సూపరింటెండెంట్ రావుల గిరిధర్ గురువారం మండలానికి రానున్నారు. పుల్గర్‌చర్ల గ్రామంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేయనున్న సీసీ కెమెరాలను ప్రారంభించి స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించనున్నారు. కాగా గతంలో కల్వరాల, గోవర్ధనగిరి, వీపనగండ్ల గ్రామాల్లో ప్రజల నుంచి విరాళాలు సేకరించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నాసిరకంగా ఉండడంతో అవి మున్నాళ్ళ ముచ్చటగా పనిచెయ్యకుండా పోయాయి. ఈ దఫానైన నాణ్యతతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి సేకరించిన విరాళాలపై ఎస్‌పి దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది..?



ప్రస్తుతం బయటికి వస్తున్న మురుగునీరు

- కస్తూర్బాలో మురుగునీటి సమస్య
- కాలనీలోకి వస్తున్న డ్రైనేజీ
- రెండేళ్ల నుంచి పరిష్కారం కాని సమస్య
- నిరసనలకు సిద్ధమంటున్న కాలనీవాసులు



కాలనీలోకి చేరిన మురుగునీరు (ఫైల్)

గోపాల్‌పేట: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల మురుగునీరు ముందుకు పారడం లేదు. మురుగు నీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో డ్రైనేజీ నిండి రోడ్లమీద ప్రవహించి కాలనీలోకి చేరుతోంది. దీంతో కాలనీవాసుల ఇబ్బందులు ఎవరితో చెప్పుకోలేని పరిస్థితి నెలకొన్నది. గత రెండేళ్ల కిందట సమస్య ఉన్నా అప్పుడూ ఇప్పుడూ అంటూ కాలం వెళ్లదీస్తున్నారు తప్పితే ఇప్పటివరకు సమస్య పరిష్కరించడం లేదు. దీంతో స్థానికంగా ఉండే కాలనీవాసులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారం కాకుంటే తొందరలోనే కాలనీవాసులంతా కలిసి సమస్య పరిష్కారం చేసేవరకు రోడ్డెక్కి ధర్నాకు దిగుతామని చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి

మండల కేంద్రంలో సుమారు పదేళ్లకిందట కస్తూర్బా పాఠశాల ప్రారంభమైంది. ఆరు నుంచి పదోతరగతి వరకు 150మంది విద్యార్థులతో ప్రారంభమైంది. పాఠశాల నిర్మాణం అంతా బండ మీద నిర్మించారు. డ్రైనేజీ, వాడిన నీరు వెళ్లేందుకు ఇంకుడుగుంత నిర్మించలేదు. అన్నింటికీ ఒకే డ్రైనేజీ గుంత తీసి వదిలారు. ప్రస్తుతం పాఠశాలలో ఇంటర్‌కూడా ప్రారంభమైంది. విద్యార్థుల సంఖ్య సుమారు 350కి చేరింది. దీంతో విద్యార్థులు ఎక్కువ మొత్తంలో వినియోగించడం, ఆ నీరు డ్రైనేజీలోకి వెళ్లి నిండిపోయి బయటికి రావడంతో కంపు కొడుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో డ్రైనేజీ నిండిపోయి మురుగు స్థానిక కాలనీలోకి చేరింది. దీంతో కాలనీవాసులు ఆందోళనకు దిగడంతో అధికారులు ఎండాకాలంలో పాఠశాల బంద్ ఉంటుంది అప్పుడు సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఎండాకాలంలో పనులు చేయకపోవడంతో ప్రస్తుతం మురుగు బయటికి వచ్చి కంపు కొడుతోంది. దీంతో అటు విద్యార్థులు, ఇటు కాలనీవాసులు ఎప్పుడు అనారోగ్యానికి గురవుతారోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కంపు భరించలేకపోతున్నాం



స్థానికంగా ఉండే కస్తూర్బా పాఠశాల నుంచి మురుగు నీరు బయటికొచ్చి కంపు కొడుతోంది. భరించలేక పోతున్నాం. సాయంత్రం అయిందంటే చాలు కంపు ఎక్కువగా వస్తోంది. సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్నారు. కానీ పనిమాత్రం చేయడం లేదు. ఏదైనా పెద్ద సమస్య జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–లక్ష్మి, కాలనీవాసి, గోపాల్‌పేట

మురుగు బయటికి వదిలేశారు



గత ఎండాకాలం కంటే ముందు కస్తూర్బాలో మురుగు వచ్చిందని తెలిసి పీఆర్ డిపార్ట్‌మెంట్ వాళ్లు పాఠశాలవద్దకు చేరుకుని పరిశీలించారు. ఆ తర్వాత కాంట్రాక్టర్ వచ్చి కొంతవరకు పనిచేశాడు. మా కాంపౌండ్ వరకు మాత్రమే నీరు వెళ్లేలా చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు ముగురు నీరు బయటికి వస్తోందని కాలనీ ప్రజలు తిడుతున్నారు.

–దీప్తి, ఎస్ఓ, కస్తూర్బా పాఠశాల, గోపాల్‌పేట

రేషన్‌కార్డుల జారీతో పేదల కల సాకారం

వనపర్తి: రేషన్‌కార్డుతో పేదలు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకొని, సద్వినియోగం చేసుకోవా లని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో పాటు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లుగా ప్రజలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిచ్చారెడ్డి, మహేష్, జిల్లాపౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తామని ఎమ్మెలే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పద్మశాలికల్యాణ మండపంలో రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రేషన్‌కార్డుల కళను సీఎం సాకారం చేయడంతో పేదలు సంతోషంవ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల పంపిణీతో పేదలకు మేలు జరుగుతుందన్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామరాజు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కాశీ విశ్వనాథ్, మాజీ ఎంపీపీ వెంకటయ్య, డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రకాష్, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

భవిత కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న భవితకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామానికి వస్తున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే నివాళి



మదనాపురం: మండలకేంద్రంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలు తల్లి మాజీ సర్పంచ్ భాగ్యమ్మ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఇటీవల భానుప్రకాష్‌రెడ్డి సతీమణి అరుణమ్మ మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. వారివెంట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్. మండల పార్టీ ప్రెసిడెంట్ యాదగిరి, నాయకులు విజయేందర్‌రెడ్డి, చాంద్‌పాషా, సత్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం

ఆత్మకూర్: భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదర్శ్ సుర భి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. దరఖాస్తుల వివరాలను తహసీల్దార్, డీటీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, డీటీ ప్రసాద్, ఆర్ఐ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు

ఖిల్లాఘనపురం: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే అవార్డులు, రివార్డులు వాటంతట అవే వస్తాయని కాంప్లెక్స్ హెచ్ఎం కాళిదాసు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన మామిడిమాడ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను అయనతో పాటుగా ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్స్ గీతా, అంజలయ్య, విజయ్‌కుమార్, చంద్రశేఖర్, తాజుద్దీన్, కవిత, శ్రీనువాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నీరులేక ఎండుతున్న పంటలు



కంబాళాపురంతండా శివారులో ఎండుతున్న వరిపంటలు

వనపర్తి రూరల్: పాన్‌గల్ మండలం మాదాంపురం దగ్గర నుంచి వచ్చే భీమా సబ్ డిస్టిబ్యూషన్ కాల్వ కింద తాటిపాముల, కంబాళాపురం, కంబాళాపురం తండా గ్రామాల శివారులో దాదాపు 500 ఎకరాల్లో వానకు వడ్లు గొరుకు వేశారు. మొలకలు వచ్చి వానలు లేక కాల్వకు నీళ్లురాక వరితూకాలు, పంటలు ఎండి పోతున్నాయని మాజీ సర్పంచ్ గౌడ్‌నాయక్, గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భీమా ప్యాకేజీ 27 డిస్ట్రిబ్యూషన్ కాల్వలో నీళ్ల నిండుగా పోతున్న మాందాపూర్ దగ్గర నుంచి కంబాళాపురం తండా వైపు వెళ్లే సబ్‌మైనర్ డిస్ట్రిబ్యూషన్ కాల్వ తూము నీటి ప్రవాహానికి కన్నా ఎత్తు భాగంలో ఉండంతో నీళ్ల రావలేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వకు పైపు కిందికి దించి నీటిని అందించాలని రైతులు కోరారు. లేదంటే భారీ ఎత్తున రైతులను సమీకరించి ధర్నా చేస్తామని చేస్తామని గిరిజన రైతులు హెచ్చరించారు.

మద్యం దుకాణంలో చోరీ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని మద్యం దుకాణంలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. షాప్ యజమాని పెద్ద ఆంజనేయులుగౌడ్, పోలీసుల కథనం ప్రకారం.. పాలమూరు ప్రధానరోడ్డుకు సమీపంలో మంగళవారం రాత్రి షాపు మూసితాళాలు వేసుకుని వెళ్లారు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి ఓ పక్కన ఇనుపరేకు వంచి కనిపించింది. షాపు తెరిచి పరిశీలించగా రూ.10వేలనగదు, రూ.5వేల విలువచేసే ఫోన్ తో పాటుగా 7మద్యం ఫుల్ బాటిల్లు తీసుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి వచ్చిన ఎస్సై జి.నరేష్ పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీంతో ఆనవాళ్లను సేకరించారు. సీసీ పుటేజీల్లో సక్రమంగా కనిపించలేదు. దొంగలు ముందుగానుు సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్‌ను కట్ చేయడంతో పాటు మెమొరీకార్డును తీసుకెళ్లారు. ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బేస్ క్యాంపు వాచర్‌కు ఎక్సలెన్స్ అవార్డు

కొల్లాపూర్ రూరల్: పులుల సంరక్షణకు కృషి చేస్తున్న సిబ్బందికి అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా జూలై 29న అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ప్రదానం చేశారు. ఇందులో భాగంగా కొల్లాపూర్ రేంజ్ నుంచి ఎర్రపెంట సెక్షన్ జాలిపెంట బేస్ క్యాంపులోని మొలచింతపల్లి గ్రామానికి చెందిన మిర్యాల దర్గయ్య బేస్ క్యాంపు వాచర్‌గా పని చేస్తున్నారు. ఆయన సీఎఫ్ అవార్డుకు ఎంపిక అయ్యారు.అవార్డును రామ్మోహన్ ఎఫ్‌డీఓ ప్లయింగ్ స్క్వాడ్ బుధవారం మన్ననూరులో అందుకున్నారు. అవార్డు రావడంతో బేష్ క్యాంపు సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్: ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలోని గురుకుల పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ నిర్వహించారు. గురుకుల పాఠశాలలకు స్వంత భవనాలు నిర్మించాలని, ఉపాధ్యాయుల పనివేళలు సవరించాలని, ఖాళీగా ఉన్న కేర్‌టేకర్, డిప్యూటీ వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని, సెలవు దినాల్లో విధులు నిర్వహించిన వారికి వీక్లీ ఆఫ్ ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో శంకర్ ఉన్నారు.

పింఛన్లు పంపిణీ

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో బుధవారం ముఖగుర్తింపు ద్వారా ఆసరా పింఛన్లను డాక్ సేవకుడు నరేష్, పంచాయతీ కార్యదర్శి విష్ణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పుల్లారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేలిముద్రలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని దీంతో ముఖగుర్తింపు ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల అధ్యక్షుడు బంగారయ్య, రాజాగౌడ్ పాల్గొన్నారు.

తండాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

అమరచింత: ప్రభుత్వం తండాల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తూ గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నదని పశుసంవర్ధక శాఖ, క్రీడా, యువజనుల సర్వీస్‌శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని చంద్రనాయక్‌తండాలో రూ.11లక్షలతో చేపట్టిన తాగునీటి పథకాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ మేరకు చంద్రనాయక్ తండాలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తండాల అభివృద్ధిని విస్మరించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తండాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు తగు ప్రణాళికతో ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో ఒక్క డబుల్‌బెడ్ రూం ఇల్లు కూడా మంజూరు చేసు కోలేని స్థితిలో మాజీ ఎమ్మెల్యే ఉన్నారని, నియోజకవర్గం మొత్తంలో 3వేలకు పైగా ఇళ్లను మంజూరు చేశామన్నారు. చంద్రనాయక్‌తండాలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం రూ.40లక్షల త్వరలోనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకా లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్ర. దాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, హన్మంతు నాయక్, భద్యానాయక్, హరీష్‌నాయక్‌తో పాటు ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, తహసీల్దార్ రవికుమార్ యాదవ్, ఏఈ రుక్మేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాం సేవలు ఆదర్శనీయం

ఆత్మకూర్: బాబు జగ్జీవన్‌రాం ఆదర్శనీయుడని జ్యోతిరావ్‌పూలే, అంబేడ్కర్‌లాంటి మహ నీయుల ఆశయాలతో కొనసాగారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం రాత్రి బస్టాండ్ ఎదురుగా జగ్జీవనరాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రగీతకార్మిక చైర్మన్ నాగరాజుగౌడ్, మార్కెట్ చైర్మన్ రహెమతుల్లా, మాజీ ఎంపీపీలు శ్రీధర్‌గౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్మిస్తున్న సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం బిల్లులు మంజూరు కాక అసంపూర్తిగా మిగిలిపోయింది. ఉపాధిహామీ పథకం ద్వారా రూ.3లక్షల నిధులతో నిర్మిస్తున్న సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలకు సంబంధించిన బిల్లుల మంజూరులో జాప్యం చేస్తుండడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో పీహెచ్‌సీకి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బిల్లులు త్వరగా మంజూరు చేసి నిర్మాణ పనులను పూర్తి చేసేలా తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఏపీఓ కుర్మయ్యను వివరణ కోరగా బిల్లులు మంజూరు కాకనే నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు ఆయన పేర్కొన్నారు.



అసంపూర్తిగా నిర్మించిన మరుగుదొడ్ల నిర్మాణం

ప్రజా సేవ కోసమే రాజకీయాల్లో వచ్చా

మదనాపురం: ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో రేషన్‌కార్డుల పంపిణీ పాల్గొని మాట్లాడుతూ.. గత పదేళ్లలో రేషన్‌కార్డులు మంజూరు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులు పెట్టిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఇచ్చినమాట మేరకు రేషన్‌కార్డులు ఇస్తున్న ఏకైక కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ప్రజాసంక్షేమం దిశగా పాలన సాగిస్తున్నామన్నారు, అనంతరం తిరుమలయ్యపల్లిలో రూ.10లక్షలతో పాఠశాల భవన నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌చైర్మన్ ప్రశాంత్, వైఎస్ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, సమన్వయ కమిటీ అధ్యక్షుడు మహేష్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

నాణ్యమైన ఆహారం అందించాలి

అమరచింత: విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికరమైన ఆహారం అందించాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏడీ, మండల ప్రత్యేక ఆధికారి అఫ్జలుద్దీన్ అన్నారు. మండలంలోని ఎస్సీ వసతి గృహాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ మేరకు స్టాక్‌రూంలో సరుకుల వివరాలు, నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారనే విషయాలను వార్డెన్ చంద్రన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందిస్తున్నదన్నారు. హాస్టల్‌కు రక్షణగోడ లేకపోవడంతో విష పురుగులు, పశువులు వస్తున్నాయని ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.



సరుకులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

అదుపు తప్పి లారీ బోల్తా

కొత్తకోట రూరల్: అదుపుతప్పి లారీ బోల్తా పడటంతో క్యాబిన్‌లో ఇరుక్కున్న ఇద్దరిని ప్రాణాలతో కాపాడిన ఘటన పాలెం జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, లారీ డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం .. కర్ణాటక రాష్ట్రం బెంగుళూర్ నుంచి లారీ టమాటల లోడ్‌తో ఉత్తరప్రదేశ్‌కు మంగళవారం రాత్రి బయలు దేరింది. బుధవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో పాలెం సమీపంలోకి రాగానే లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో లారీడ్రైవర్ రాసిల్, మరో డ్రైవర్ అమీర్‌లు ఇద్దరు క్యాబిన్‌లో ఇరుక్కున్నారు. ప్రమాదం జరిగిన విషయాన్ని అటుగా వ్యవసాయ పొలాలకు వెళ్తున్న రైతులు గమనించి అమీర్‌ను బయటకు తీయగా, మరోడ్రైవర్ రాసిల్ ఇరుక్కుపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఆనంద్ ఫైర్, హైవే సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అందరూ కలిసి జేసీబీ సహాయంతో రాసిల్‌ను రెండుగంటల పాటు శ్రమించి బయటకు తీశారు. ఇద్దరిని ప్రాణాలతో కాపాడటంతో స్థానికులు సైతం పోలీసుల, ఫైర్ సిబ్బంది, హైవే సిబ్బందిని అభినందించారు. ఇద్దరు డ్రైవర్లను 108లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.



పాలెం సమీపంలో బోల్తా పడిన టమాటల లారీ

పాదయాత్రలో కేతూరికి చోటు

పాన్‌గల్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో నిర్వహించే పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాల్లో రాష్ట్రస్థాయి కో–ఆర్డినేటర్‌గా పాన్‌గల్ మండలం కేతేపల్లికి ఏఐసీసీ ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేశ్‌కు చోటు కల్పించారు. ఈ అవకాశం కల్పించడంపై ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.